క్లుప్తంగా

సూర్యదేవుడిని దర్శించుకున్న చంద్రశేఖర్‌రెడ్డి



సూర్యదేవుడిని దర్శించుకుంటున్న కాకినాడ సిటీ ఎమ్మెల్యే చంద్రశేఖర్‌రెడ్డి

పెదపూడి: మండలంలోని జి.మామిడాడలో ప్రసిద్ధి చెందిన సూర్యనారాయణమూర్తి స్వామి వారిని కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి దర్శించుకున్నారు. ఆయనకు స్థానిక పార్టీ నాయకులు చింతా దొరబాబు ఆధ్వర్యంలో ఘనంగా స్వాగతం పలికారు. చంద్రశేఖర్‌రెడ్డి స్వామి వారిని దర్శించుకుని కొంత సేపు ప్రత్యేక పూజల్లో కూర్చున్నారు. అనంతరం స్వామి వారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు



గుమ్మళ్లదొడ్డి ప్రధాన రహదారి జంక్షన్ వద్ద స్టాప్ బోర్డులు ఏర్పాటు చేస్తున్న ఎస్సై నాగరాజు

గోకవరం: రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్టు గోకవరం ఎస్సై కె.నాగరాజు తెలిపారు. మండలంలో గుమ్మళ్లదొడ్డి గ్రామంలో ప్రధాన రహదారిపై జంక్షన్ వద్ద బుధవారం స్టాప్ బోర్డులను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనదారులు నిబంధనలు పాటించాలన్నారు. పరిమితికి మించి వేగంతో వాహనాలు నడిపే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నేడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

పెదపూడి: స్థానిక మండల పరిషత్ సర్వసభ్య సమావేశం గురువారం ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ పి.ఆశాజ్యోతి తెలిపారు. బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఎంపీపీ కేతా తులసి అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో గత మూడు నెలలుగా జరిగిన ప్రగతిపై అధికారులు వివరిస్తారన్నారు. సమావేశానికి సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, వివిధ శాఖాధికారులు హాజరై జయప్రదం చేయాలని ఆమె కోరారు.

19న వేంకటేశ్వరుని కల్యాణం

సీతానగరం: రఘుదేవపురంలో వేంచేసి ఉన్న వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం ఈ నెల 19న ఘనంగా నిర్వహిస్తామని ఆలయ అభివృద్ధి సంక్షేమ సంఘ సభ్యులు బుధవారం తెలిపారు. ఇక్కడి అగ్రహారంలోని వేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో రాజమహేంద్రవరానికి చెందిన శ్రీఅమ్మ ఒడి సేవా తరంగిణి వారి ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి 7 గంటలకు శ్రీఅలివేలు మంగ, పద్మావతి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామివార్ల కల్యాణ మహోత్సవం నిర్వహిస్తామన్నారు. స్వామివార్ల కల్యాణంలో పాల్గొనే దంపతులు ముందుగా వారి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. మరింత సమాచారం కోసం 98482 03909ను సంప్రదించాలని కోరారు.

ఓటేసి వస్తూ వ్యక్తి మృతి

మరొకరికి గాయాలు

చౌటుప్పల్: ఎన్నికల్లో ఓటు వేసేందుకు హైదరాబాద్ నుంచి ఇద్దరు స్నేహితులు బైక్‌పై సొంతూర్లకు వెళ్లారు. తిరుగు ప్రయాణంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు దుర్మరణం చెందగా.. మరొకరికి గాయాలయ్యాయి. ఈ ఘటన యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండల పరిధిలోని ఆరెగూడెం స్టేజీ సమీపంలో 65వ నంబర్ జాతీయ రహదారిపై బుధవారం జరిగింది. రాజమహేంద్రవరానికి చెందిన కొనికళ్ల దీపక్ రాజ్ (29), విశాఖపట్టణానికి చెందిన అనిరుథ్ స్నేహితులు. వీరిద్దరు హైదరాబాద్‌లోని కూకట్‌పల్లిలో అద్దె ఇంట్లో ఉంటూ అక్కడే ఓ ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తున్నారు. ఈ నెల 13న జరిగిన ఎన్నికల్లో ఓటు వేసేందుకుగాను బస్సులో స్వగ్రామాలకు వెళ్లేందుకు వారు ప్రయత్నించారు. కానీ టికెట్లు దొరక్కపోవడంతో బైక్‌పై వెళ్లారు. ఓటేసి బుధవారం తిరిగి హైదరాబాద్‌కు వస్తుండగా చౌటుప్పల్ మండలం ఆరెగూడెం స్టేజీ వద్ద రోడ్డుపై ఆగిన కంటైనర్‌ను వెనుక నుంచి ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో దీపక్‌రాజ్ తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందాడని నిర్ధారించారు. అనిరుథ్‌కు గాయాలయ్యాయి.

కార్మికుల ఆందోళన విరమణ

కడియం: విధుల్లో ఉండగా స్థానిక ఏపీ పేపరుమిల్లు కాంట్రాక్టు కార్మికుడు గోకవాసు మృతి చెందగా, అతని కుటుంబానికి న్యాయం చేయాలంటూ మంగళవారం రాత్రి ఆందోళన జరిగింది. దక్షిణ మండలం డీఎస్పీ అంబికా ప్రసాద్ సమక్షంలో మిల్లు ప్రతినిధులతో చర్చలు జరిపారు. అర్ధరాత్రి దాటే వరకూ కొనసాగిన ఈ చర్చల్లో కాంట్రాక్టు కార్మికులకు వర్తించే సదుపాయాలను అందజేయడంతో పాటు, కార్మికులు, మిల్లు ఉద్యోగుల సహకారంతో సాయం చేస్తామని, అలాగే మృతుడి కుటుంబ సభ్యుల్లో ఒకరికి ఉద్యోగం కల్పిస్తామని హామీ ఇచ్చారు. దీంతో ఆందోళనను విరమించారు.

ప్రగతి నాడి.. బూరుగుపూడి

- ఐదేళ్లలో గణనీయమైన అభివృద్ధి
- సంక్షేమ పథకాలతో 2 వేల మందికి రూ.7.7 కోట్ల లబ్ధి
- రూ.6.38 కోట్ల వ్యయంతో పలుచోట్ల పనులు

మధురపూడి: కొన్నేళ్ల క్రితం తాగు, సాగునీటి సమస్యలు, అధ్వాన రోడ్లతో కళావిహీనంగా ఉన్న బూరుగుపూడి.. నేడు సమృద్ధిగా రక్షిత నీరు, పుష్కలంగా సాగునీటి వనరులు, సీసీ రోడ్లు, డ్రైన్లు, పక్కా ప్రభుత్వ భవనాలతో కళకళలాడుతోంది. వైఎస్సార్ సీపీ అధికారాన్ని చేపట్టిన ఐదేళ్లలో బూరుగుపూడి గ్రామ పంచాయతీ కోట్లాది రూపాయల వ్యయంతో గణనీయమైన అభివృద్ధి సాధించింది. ఇంకా అనేక పనులు నిర్మాణ దశలో ఉన్నాయి. గ్రామాభివృద్ధితో పాటు, ప్రభుత్వ సంక్షేమ పథకాలతో వివిధ వర్గాల వారు ఆర్థిక పరిపుష్టిని సాధించారు. ఐదేళ్ల కాలంలో సుమారు రెండు వేల మందికి వివిధ సంక్షేమ పథకాల ద్వారా రూ.7.7 కోట్ల లబ్ధి చేకూరగా, రూ.6.38 కోట్లతో పలు అభివృద్ధి పనులు చేపట్టారు.

అభివృద్ధి పనులెన్నో..

గ్రామంలోని రామాలయం సెంటర్‌లో రూ.20.80 లక్షలతో వైఎస్సార్ హెల్త్ సెంటర్ నిర్మించి, ప్రజలకు కార్పొరేట్ వైద్యాన్ని అందిస్తున్నారు. గ్రామంలోని పేద, మధ్య తరగతి ప్రజలకు సంపూర్ణ ఆరోగ్యాన్ని, కార్పొరేట్ స్థాయిలో వైద్య సేవలు అందించాలన్నది ప్రభుత్వ లక్ష్యం. గ్రామంలో విత్తు నుంచి పంటల విక్రయం వరకూ రైతులకు నేస్తంగా ఆర్‌బీకేను ఏర్పాటు చేశారు. రూ.23 లక్షలతో దీన్ని నిర్మించారు. 516 జాతీయ రహదారి నిర్మాణంతో గ్రామానికి మరింత ప్రయోజనం చేకూరింది. డివైడర్, విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయడం ప్రయాణికులకు సౌలభ్యంగా ఉంది.



బూరుగుపూడి ఎస్సీపేటలో నిర్మించిన సీసీ రోడ్డు



బూరుగుపూడి సచివాలయం

అందమైన పల్లెగా అవతరణ



బూరుగుపూడి గ్రామం అందమైన పల్లెగా అవతరించింది. దీనికి బ్రిటిష్ కాలం నుంచి విశిష్ట ప్రాముఖ్యత ఉంది. ఆ పాలకులు ఇక్కడ కార్యకలాపాలు నిర్వహించే వారు. ఇక్కడ మంచి భవనాలను నిర్మించారు. నాణ్యమైన కట్టడాలుండేవి. స్వాతంత్ర్యం వచ్చిన చాలా కాలం తర్వాత పల్లె దుర్భరంగా ఉండేది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా బూరుగుపూడి రూపురేఖలు మార్చింది. గ్రామ సచివాలయ భవనం, రైతు భరోసా కేంద్రం, హెల్త్ సెంటర్‌తో పాటు, రోడ్లు, డ్రైన్ల నిర్మాణంతో ఊరు ఆకర్షణీయంగా తయారైంది.

– క్రొవ్విడి సూర్యనారాయణమూర్తి, బూరుగుపూడి

గ్రామంలో చేపట్టిన పనులు ఇలా..

అభివృద్ధి పనులు	నిధులు (రూ.ల్లో)
గ్రామంలో సీసీ రోడ్లు(1,500 మీటర్లు)	27 లక్షలు
గ్రామంలో సీసీ డ్రైన్లు(4 కి.మీ.)	89 లక్షలు
పంచాయతీ కార్యాలయం, వైఎస్సార్ హెల్త్ సెంటర్, ఆర్బీకేలు	69.74 లక్షలు
బల్క్ మిల్క్ సెంటర్	15.80 లక్షలు
ఎంపీయూపీ స్కూల్ (నాడు–నేడు ఫేజ్1)	17 లక్షలు
బోర్‌వెల్	54 లక్షలు
ఓపెన్ జిమ్	24 లక్షలు
జగనన్న లేఅవుట్‌లో ఇళ్ల స్థలాలు, పట్టాలు పంపిణీ, నిర్మాణానికి రుణ సదుపాయం	2.2 కోట్లు
సొంత స్థలాలున్న వారికి రుణ సదుపాయం	41 లక్షలు
గడప గడపకూ ద్వారా సీసీ రోడ్లు, డ్రైన్లు	40 లక్షలు

అపర భగీరథుడు సర్ ఆర్థర్ కాటన్

అనపర్తి: అఖండ గోదావరి నదిపై ధవళేశ్వరం వద్ద ఆనకట్టను నిర్మించటం ద్వారా ఉభయగోదావరి జిల్లాలను సస్యశ్యామలం చేసి అన్నదాతలను ఆదుకున్న అపర భగీరథుడు సర్ ఆర్థర్ కాటన్ అని అనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరక్టర్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి అన్నారు. బుధవారం సర్ ఆర్థర్ కాటన్ జయంతిని పురస్కరించుకుని మండలంలోని రామవరంలో ఉన్న కాటన్ విగ్రహానికి సర్పంచ్ గిరడా గంగాభవానితో పాటు పలువురు ప్రజాప్రతినిధులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ బ్రిటిష్ కాలంలో నీటిపారుదల శాఖ ఇంజినీరుగా భారతదేశానికి విచ్చేసిన కాటన్ మహాశయుడు 1852లో ధవళేశ్వరం వద్ద ఆనకట్ట నిర్మాణాన్ని చేపట్టారన్నారు. ఆయన చలవ వల్లే గోదావరి జిల్లాలు అన్నపూర్ణగా పేరొందాయని అన్నారు. డెల్టా రూపశిల్పి కాటన్‌ను స్ఫూర్తిగా తీసుకుని దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి రాష్ట్రంలో జలయజ్ఞం పేరుతో ప్రాజెక్టుల నిర్మాణానికి కృషి చేశారన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు నల్లమిల్లి భాగ్యలక్ష్మి, గొలుగూరి గౌతమి, పార్టీ మండల అధికార ప్రతినిధి నల్లమిల్లి వెంకటరెడ్డి, పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ చైర్మన్ గుడిమెట్ల వెంకటరెడ్డి, పంచాయతీ పాలక మండలి సభ్యురాలు కర్రి రుక్మిణి, నల్లమిల్లి బుజ్జి, కర్రి సురేంద్రరెడ్డి, మంగిరెడ్డి, నల్లమిల్లి రాజు తదితరులు పాల్గొన్నారు.

పందలపాకలో..

బిక్కవోలు: గోదావరి జిల్లాలకు సాగు, తాగునీటి రూపకర్త కాటన్ దొర సేవలు చిరస్మరణీయమని చైతన్య ఫ్రెండ్స్ కమిటీ సభ్యులు తెలిపారు. బుధవారం మండలంలోని పందలపాక గ్రామంలో కాటన్ దొర జయంతిని పురస్కరించుకుని ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా చైతన్య పార్కు ప్రారంభించారు. అనంతరం ఆటలు ఆడుకోవడానికి వచ్చిన చిన్నారులకు మిఠాయిలను అందించారు. కమిటీ సభ్యులు నల్లమిల్లి సుబ్బారెడ్డి మాట్లాడుతూ సర్ ఆర్థర్ కాటన్ ధవళేశ్వరం ఆనకట్ట నిర్మించి ఉభయ గోదావరి జిల్లాల రైతులకు ఆత్మ బంధువుగా నిలిచారన్నారు. కార్యక్రమంలోని కమిటీ సభ్యులు దార్వంపూడి సురేందర్‌రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.



రామవరంలో కాటన్ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఏఎంసీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి తదితరులు



పందలపాకలో కాటన్ విగ్రహం వద్ద నివాళులర్పించిన చైతన్య ఫ్రెండ్స్ కమిటీ సభ్యులు

వైఎస్సార్ సీపీదే విజయం

ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి



ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన పెదపూడి మండల వైఎస్సార్ సీపీ నాయకులు

అనపర్తి: ఈ నెల 13న జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ మళ్లీ విజయం సాధిస్తుందని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. బుధవారం నియోజకవర్గంలోని పెదపూడి మండలం జి.మామిడాడకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు స్థానిక పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసి మండలంలో పోలింగ్ సరళిని వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ ఎన్నికల పోలింగ్‌కు మహిళలు, యువత విశేషంగా తరలి రావడం వైఎస్సార్ సీపీకి శుభ పరిణామమన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంపై ఉన్న విశ్వాసం, తిరిగి జగనన్న సీఎం అయితే ఇచ్చిన మాటకు కట్టుబడి మరిన్ని సంక్షేమ పథకాలు అమలు చేస్తారని, దీంతో తమ కుటుంబాలకు మరింత మేలు చేకూరుతుందన్న నమ్మకంతో ప్రజలు అధిక సంఖ్యలో ఓటింగ్‌లో పాల్గొన్నారని చెప్పారు. నియోజకవర్గ ప్రజలు వైఎస్సార్ సీపీని ఆదరించారని ఈ సందర్భంగా ప్రజలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ప్రజాశీస్సులతో ఈ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ మంచి మెజార్టీతో విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. అనపర్తి మండలం అనపర్తి సావరం ప్రాంతానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు సైతం ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు.

కాయ్ రాజా కాయ్

- ఎన్నికల ఫలితాలపై బెట్టింగ్‌ల జోరు
- రూ.లక్షల్లో చేతులు మారుతున్న వైనం



రాజానగరం: నియోజకవర్గంలో సార్వత్రిక ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా జరిగింది. ఓటర్లు ఇచ్చిన తీర్పు ఎటువైపు అనే విషయమై ప్రతి ఒక్కరిలో తీవ్ర ఉత్కంఠ రేపుతోంది. ఎవరికి వారే తమకు అనుకూలంగా లెక్కలు చెబుతున్న నేపథ్యంలో కాయ్ రాజా కాయ్ అంటూ బెట్టింగులు జోరందుకున్నాయి. నియోజకవర్గంలోని సీతానగరం, కోరుకొండ, రాజానగరం మండలాల్లో 2,16,491 మంది ఓటర్లలో 1,88,064 మంది ఓటు వినియోగించుకున్నారు. ఇందులో 94,571 మంది పురుషులు కాగా 94,928 మంది మహిళలు. అంటే పురుషుల ఓట్ల కంటే 357 మహిళా ఓట్లు ఎక్కువగా పోలయ్యాయి. ఇతరులు ఆరుగురు ఉన్నారు. ఈ ఎన్నికలో మహిళల ఓటింగ్ పెరిగింది. ఈ పెరిగిన ఓటింగ్ ఎవరికి మేలు చేస్తుందనే అంశంపై జనం ఎక్కువగా చర్చించుకుంటున్నారు. వివిధ సంక్షేమ పథకాలతో జనరంజక పాలన అందించిన జగన్‌మోహన్‌రెడ్డికి మహిళలు మద్దతు ఉందనే విషయం జగమెరిగిన సత్యం. దీనికితోడు సిటింగ్ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా గతంలో ఏ ఎమ్మెల్యే చేయనంతటి అభివృద్ధిని (సుమారు రూ. 1,773 కోట్లు) చేసి చూపారు. ప్రజలందరికీ అందుబాటులో ఉంటూ ప్రతి కుటుంబంలో తానొక సభ్యునిగా మెలుగడమే కాకుండా ప్రజా సేవలో తన కుటుంబ సభ్యులను కూడా భాగస్వాములను చేశారు. ఈ విధంగా ఆడపడచులకు జక్కంపూడి కుటుంబం పట్ల ప్రేమాభిమానాలున్నాయి. ఈ క్రమంలో పోలింగ్‌లో పెరిగిన ఓటింగ్, మహిళల ఓట్లు అటు జగన్‌కి ఇటు జక్కంపూడికి అనుకూలంగా 'ఫ్యాను' గుర్తుకే పడి ఉంటాయని ధీమాగా ఉన్నారు.

2009 నుంచి ఓటింగ్ సరళి


నియోజకవర్గ పునర్విభజన జరిగిన తరువాత రాజానగరంలో 2009లో జరిగిన ఎన్నికలలో 1,64,831 ఓటర్లు ఉండగా 1,42,552 మంది (86.48 శాతం) ఓటు చేశారు. ఆ ఎన్నికలో టీడీపీ అభ్యర్థి పెందుర్తి వెంకటేష్ 6,936 ఓట్ల తేడాతో విజయం సాధించారు. 2014లో జరిగిన ఎన్నికల్లో 1,87,185 మందికి 1,60,757 మంది (85.88 శాతం)ఓటు హక్కు వినియోగించుకోగా, రెండోసారి పెందుర్తి వెంకటేష్ 8,887 ఓట్ల వ్యత్యాసంతో గెలిచా. 2019 ఎన్నికలలో 2,01,260 మందికి చేరిన ఓటర్లలో 1,76,785 మంది (87.83 శాతం) ఓటు చేశారు. ఈ ఎన్నికల్లో వరుసగా మూడోసారి పోటీ చేసిన టీడీపీ పెందుర్తి వెంకటేష్ వైఎస్సార్ సీపీ అభ్యర్థి జక్కంపూడి రాజా చేతిలో 31,772 ఓట్ల తేడాతో ఓటమి పాలయ్యారు. ఏదేమైనా ఈ ఎన్నికల్లో బెట్టింగ్‌లతో రూ.లక్షలు చేతులు మారనున్నాయి.

19 నుంచి కల్యాణ మహోత్సవాలు

సీటీఆర్ఐ: రాజమహేంద్రవరం క్షేత్రపాలక స్వామి శ్రీరుక్మిణీ సత్యభామా సమేత శ్రీవేణుగోపాల స్వామి ఆలయంలో స్వామివారికి ఈ నెల 19వ తేదీ నుంచి కల్యాణ మహోత్సవాలు జరుగుతాయని కార్యనిర్వహణాధికారి ఎన్ఎస్ పెద్దిరాజు ఓ ప్రకటనలో బుధవారం పేర్కొన్నారు. 19న స్వామివారికి తిరువీధి ఉత్సవం, 20న నిత్య హోమం, 21న నిత్య హోమం, సదస్యం, 22న రథోత్సవం , 23న స్వామి వారికి చక్రతీర్థం, 25న పుష్పయాగోత్సవం నిర్వహించనున్నారు.

సంక్షేమానికే ప్రజల ఓటు

- జగనన్నే మళ్లీ ముఖ్యమంత్రి
- పారిశ్రామిక అభివృద్ధి సంస్థ రాష్ట్ర డైరెక్టర్ సాగర్



రాజమహేంద్రవరం సిటీ: రాష్ట్రంలో ప్రజలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక పథకాలు అమలు చేశారని, అవే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి విజయాన్ని అందించనున్నాయని ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక అభివృద్ధి సంస్థ రాష్ట్ర డైరెక్టర్ కానుబోయిన సాగర్ తెలిపారు. బుధవారం రాజమహేంద్రవరంలోని ఆయన కార్యాలయంలో మాట్లాడుతూ సోమవారం జరిగిన ఎన్నికల కురుక్షేత్రంలో ప్రధానంగా మహిళలు, వృద్ధులు, దివ్యాంగులు ఇలా అన్ని వర్గాల ప్రజలు జగనన్నను గెలిపించుకోవడమే కర్తవ్యంగా భావించి ఓట్లు వేశారన్నారు. ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని ఓడించేందుకు టీడీపీ, బీజేపీ, జనసేనలు ఎన్నో కుట్రలు చేశాయని, వాటిని ప్రజలు నమ్మలేదన్నారు. అవాస్తవాలను ప్రచారం చేసిన మూడు పార్టీల నాయకులకు దిమ్మతిరిగే విధంగా ఓటుతో బుద్ధి చెప్పడానికి ప్రజలు సిద్ధమై ఓట్లు వేశారన్నారు. సీఎం జగన్ విడుదల చేసిన మేనిఫెస్టో అన్నివర్గాలకు మేలు చేసే విధంగా ఉందన్నారు. అందుకే మళ్లీ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం గద్దెనెక్కుతుందన్నారు. జూన్ 4న జరిగే ఓట్ల లెక్కింపులో ఈ విషయం స్పష్టం కానుందన్నారు. గతంలో ఎన్నడూ లేనంతగా పోలింగ్ నమోదు కావడం వైఎస్సార్ సీపీ విజయానికి సంకేతమన్నారు. సంక్షేమం పట్ల ప్రజలు చూపిన ఆదరణకు ఇదే నిదర్శనమని తెలిపారు. అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలంతా నమ్మి వైఎస్సార్ సీపీకి ఓటేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు.